క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వేముల : వేముల 33 కె.వి. విద్యుత్ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా మండల పరిధిలోని రాచకుంటపల్లె, మబ్బుచింతలపల్లె, పెద్ద జూటూరు, భూమయ్యగారిపల్లె సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం ఉదయం 7 గంటలనుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ జేఈ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని ఆయన కోరారు.

నీటి సరఫరాలో..

జమ్మలమడుగు రూరల్ : దొమ్మరనంద్యాల నుంచి నీరు సరఫరా చేసే ట్యాంక్‌ను శుభ్రం చేస్తుండటం వల్ల 16,17వ తేదీలలో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని మున్సిపల్ కమిసనర్ జి.వెంకటరామిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయం రోడ్డు, అమ్మవారిశాలవీధి, అంభాభవానివీధి, ముచ్చర్లవీధి, చాకలివీధి, కుమ్మరవీధి, మార్వాడివీధి, చిన్నబసప్పవీధి, గడ్డవీధి, పలగాడివీధి, ఫక్కీరవాడవీధి, టిక్కాయచేనువీధి, డొంకవీధి, దుత్తలూర్‌లలో నీటిసరఫరా ఉండదన్నారు. ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని ఆయన సూచించారు.

ఆలయానికి చేరిన దేవతా మూర్తుల శిలా విగ్రహాలు



లింగాల : లింగాలలో మే 1, 2, 3వ తేదీలలో ఎండోమెంట్ ద్వారా నిర్మించిన శ్రీరామాలయాన్ని ప్రారంభించి విగ్రహ ప్రతిష్ట చేయనున్నారు. ఇందుకోసం శ్రీసీతారామ, లక్ష్మణసమేత ఆంజనేయస్వాముల శిలా విగ్రహాలు ఆలయానికి చేరాయి. తమిళనాడులోని మహాబలిపురంలో రూ.2.10లక్షల వ్యయంతో తయారు చేయించిన విగ్రహాలను తీసుకొచ్చారు.

వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు



ఉపవాస దీక్షలు విరమింపజేసిన వారికి విందు వడ్డిస్తున్న ఎమ్మెల్యే

జమ్మలమడుగు : పట్టణంలోని ఆస్థానయేగౌసియా మసీదులోని ముస్లింలకు వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు పోరెడ్డి మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, హజ్‌కమిటీ చైర్మన్ బి.గౌస్‌లాజం ముస్లింలకు విందును వడ్డించారు. అనంతరం పీఠాధిపతి, గెజిటెడ్ ప్రభుత్వ ఖాజీ సయ్యద్‌షా గౌస్‌పీరాఖాద్రీలు మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సింగరయ్య, ఇండస్ట్రీయల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మార్బల్ శ్రీను, బుజ్జి, ఆస్థానయే కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి తిరునాల



వల్లూరు : మండల పరిధిలోని పాపాఘ్ని నగర్ (కట్ట బస్టాపు) వద్ద వెలసిన శ్రీ పాపాఘ్ని వీరాంజనేయస్వామి తిరునాల శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

16న బండ లాగుడు పోటీలు

ఉత్సవాల్లో భాగంగా ఈనెల 16వ తేదీన ఉదయం 9 గంటలకు పూర్తిగా ఆరు పళ్ల కలుపుకున్న వృషభ రాజములచే బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మొదటి బహుమతి రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ .10 వేలు, రూ.8 వేలు, రూ.5,016 , రూ 3,016లు అందచేయనున్నట్లు తెలిపారు. అలాగే 15న ఉదయం 9 గంటలకు ట్రాక్టర్ రివర్స్ పోటీలు జరుగుతాయని విజేతకు రూ.5,016 నగదు ఇవ్వనున్నట్లు తెలిపారు. అనంతరం 15 సంవత్సరాల లోపు పిల్లలకు పరుగు పందెం పోటీలు జరుగుతాయని, విజేతకు రూ.2,016 నగదు బహుమతి ఇవ్వనున్నట్లు తెలిపారు.

పది పరీక్షలకు 305 మంది హాజరు

వల్లూరు : మండలంలోని గంగాయపల్లె ఏపీ మోడల్ స్కూల్‌లో జరుగుతున్న పదవ తరగతి పరీక్షలకు సంబంధించి గురువారం సైన్స్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్షకు మొత్తం 307 మంది విద్యార్థులు హాజరు కావాల్సి వుండగా ఇద్దరు విద్యార్థులు గైర్హాజరయ్యారు. దీంతో 305 మంది విద్యార్థులు మాత్రమే పరీక్షకు హాజరయ్యారు.

ప్రభుత్వ పథకాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి

కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

వేంపల్లె : ప్రభుత్వ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపాయని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని ఇడుపులపాయ గ్రామ పంచాయతీ పరిధిలోని వీరన్నగట్టుపల్లెలో రెండవరోజు ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గడప గడప వద్దకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును ప్రజలతో అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని ప్రతి సమస్యను శ్రద్ధగా విన్నారు. ముఖ్యంగా పింఛన్లు, రేషన్ కార్డులు, విద్యుత్, రోడ్లు, డ్రైనేజీ తదితర సమస్యలు ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. ఇందుకు స్పందించిన ఎంపీ ఆయా అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత టీడీపీ పాలనలో రాష్ట్రం ప్రగతికి నోచుకోలేదని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక అభివృద్ధితోపాటు సంక్షేమానికి సంబంధించి ప్రతి ఒక్కటి అమలు చేసి చూపించారన్నారు. జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ చంద్రఓబుళరెడ్డి, ఎంపీపీ లక్ష్మీగాయత్రి, సర్పంచ్ శ్రీనివాసులు, డైరెక్టర్లు షబ్బీర్‌వల్లి, మునీర్, సల్మా, సర్పంచ్ చలపతి, వైఎస్సార్‌సీపీ నాయకులు కృష్ణతేజ, కొండయ్య, దర్బార అంజి, హుస్సేన్ పీరా, అజీమ్, తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డి, ఏపీఎం బాలస్వామి, హౌసింగ్ ఏఈ సుబ్రమారెడ్డి, హెచ్‌ఓ రెడ్డయ్య, ఏఓ రాజేంద్రప్రసాద్, డీఈఈ శ్రీకాంత్, సీఐ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ పరామర్శ :

వేంపల్లె పట్టణంలోని బిడాలమిట్ట ప్రాంతానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు యూత్ కొండయ్య తండ్రి వెంకటేష్ గురువారం మృతి చెందారు. ఎంపీ మృతుడి స్వగృహానికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు.

పేదల సంక్షేమమే లక్ష్యంగా పాలన

ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి



వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : పేదల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి తెలిపారు. గురువారం మండల పరిధిలోని పి వెంకటాపురంలో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ అలాగే వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందించే బాధ్యత సచివాలయ సిబ్బందిపై ఉందన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేద ప్రజల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. జగనన్న ప్రభుత్వానికి అన్ని వర్గాల ప్రజలు అండగా ఉండాలని కోరారు. గత టీడీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు పొందాలంటే జన్మభూమి కమిటీలు ఒప్పుకుంటేనే వచ్చేవని ప్రస్తుతం జగనన్న పాలనలో లబ్ధిదారులనే పథకాలు వెతుక్కుంటూ వస్తున్నాయన్నారు. సుపరిపాలన దీర్ఘకాలంగా కొనసాగాలంటే మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి సురేంద్రనాథ్‌రెడ్డి, సర్పంచ్ రవీంద్రనాథ్‌రెడ్డి, జెడ్పీటీసీ తమ్మిశెట్టి బాలయ్య, ఎంపీడీఓ సూర్యనారాయణరెడ్డి, పార్టీ నాయకులు రామచంద్రారెడ్డి, పుల్లారెడ్డి, వై.వీరభద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిప్పలూరు గృహ సారథులతో సమీక్ష

మండలంలోని తిప్పలూరు గ్రామానికి చెందిన సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో పార్టీ కార్యాలయంలో జగన్ననే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

పాడి పరిశ్రమ అభివృద్ధికి కృషి చేయాలి



దేవరాజుపల్లెలో పాడిపరిశ్రమను పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ ఆనందనాయక్

కమలాపురం : వ్యవసాయ రంగం తర్వాత రెండో స్థానంలో ఉన్న పాడి పరిశ్రమ అభివృద్ధికి వెలుగు సిబ్బంది కృషి చేయాలని డీఆర్‌డీఏ పీడీ ఆనంద నాయక్ తెలిపారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో నిర్వహించిన వీఓఏల రివ్యూ సమావేశాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సమావేశంలో చర్చిస్తున్న హౌసింగ్, లైవ్‌స్టాక్, లక్‌పతి దీదీ, జగనన్న తోడు, ఎంబీకే, ఎస్‌హెచ్‌జీ గ్రేడింగ్, ఆడిటింగ్ తదితర అంశాలపై జరిగిన రివ్యూను పరిశీలించారు. ముఖ్యంగా హౌసింగ్‌పై సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఫోకస్ చేశారని, డ్వాక్రా సంఘాల్లో ఉన్న ప్రతి సభ్యురాలికి రూ.30 వేలు రుణం మంజూరు చేయించి జగనన్న హౌసింగ్ కాలనీల్లో నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి పూర్తి చేసే విధంగా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అలాగే మండలంలో మంజూరైన లైవ్ స్టాక్ యూనిట్ల గురించి ఆరా తీశారు. ప్రతి యూనిట్ గ్రౌండింగ్ చేయాలన్నారు. అనంతరం దేవరాజుపల్లెలో లైవ్ స్టాక్ యూనిట్‌ను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. మీకు ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరిస్తానన్నారు. పాడి పరిశ్రమ ద్వారా అధిక ఆదాయం గడించవచ్చని, బాగా అభివృద్ధి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. రుణాలు పొందిన ప్రతి గ్రూపు సభ్యులు వాటిని సక్రమ పద్ధతిలో వినియోగించుకుని జీవనోపాధులు మెరుగు పరచుకోవాలన్నారు. ఎస్‌హెచ్‌జీ సభ్యులు కోసం ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశ పెట్టిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి మహిళను లక్షాధికారులను చేయడమే సీఎం జగనన్న లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో ఏసీ రఘునాథరెడ్డి, ఏపీఎం అపర్ణ, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

వల్లూరు : మహిళలు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్ తెలిపారు. స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో గురువారం జరిగిన వీఓఏల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమం ద్వారా వచ్చిన నిధులను సద్వినియోగం చేసుకుని జీవనోపాధులను పెంచుకోవడానికి కృషి చేయాలన్నారు. ప్రతి గ్రామ సమాఖ్య నుంచి కనీసం 10 మందికి జగనన్న తోడు రుణాలను అందించాలన్నారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించి పక్కాగృహాల నిర్మాణాలను వేగవంతం చేయాలని, అవసరమైన వారికి రుణాలు ఇప్పించడానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. స్త్రీనిధి రుణాలకు సంబంధించి 100 శాతం రికవరీని సాధించాలన్నారు. కార్యక్రమంలో కమలాపురం ఏరియా కోఆర్డినేటర్ రఘునాథరెడ్డి, ఏపీఎం శైలజ, సీసీలు, మండల సమాఖ్య ప్రతినిధులు, వీఓఏలు పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై అవగాహన కల్పించాలి



కమలాపురం : భూసార పరీక్షల ద్వారా మొక్క ఎదుగుదలను వివరిస్తున్న ఏడీఏ నరసింహారెడ్డి



వల్లూరులో మట్టి నమూనాల సేకరణపై అవగాహన కల్పిస్తున్న ఏవో

కమలాపురం : ప్రతి రైతుకు భూసార పరీక్షలపై అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఏడీఏ ఏవీ నరసింహారెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక 4వ ఆర్‌బీకేలో ఆర్‌బీకే సిబ్బందికి భూసార పరీక్షలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. నేల పైరుకు కావాల్సిన పోషకాలను అందిస్తూ పంటల దిగుబడులను సాధించడంలో ముఖ్య భూమిక పోషిస్తుందన్నారు. ఈ క్రమంలో భూమిలో ఉన్న పోషకాల శాతం తగ్గుతూ ఉంటుందన్నారు. తాము సాగు చేసే పంటలకు ఎంత మేరకు పోషకాలు అవసరం అని తెలుసుకోవాలంటే భూసార పరీక్షలు తప్పని సరిగా చేయాలన్నారు. అప్పుడు తగిన మోతాదులో పోషకాలు ఉన్న ఎరువులను వినియోగించాలన్నారు. అలాగే అధిక మోతాదులో రసాయనిక ఎరువులు వాడకం కూడా తగ్గిపోతుందన్నారు. భూసార పరీక్షలు చేయాలంటే వేసవి కాలంలో మట్టి నమూనాలు సేకరించాలన్నారు. పంట విత్తే ముందు గాని, పైరు కోసిన తర్వాత మాత్రమే మట్టి నమూనాలు జిగ్‌జాగ్ ఆకారంలో సేకరించాలన్నారు. ఎప్పుడూ నీరు నిల్వ ఉన్న స్థలంలో మట్టి నమూనాలు తీయరాదని, పొలంలో గట్ల వద్ద, చెట్లకు దగ్గరగా, కాలి బాటలలో, కంచెల వద్ద మట్టి తీయరాదన్నారు. రసాయనిక ఎరువులు వేసిన వెంటనే, ఎరువుల కుప్ప వద్ద మట్టి నమూనాలు సేకరించరాదన్నారు. ఈ విధంగా సేకరించిన మట్టి నమూనాలను క్వార్టర్ పద్ధతిలో వేసి, 500గ్రాములు మేరకు ల్యాబ్‌కు పంపాలన్నారు. కార్యక్రమంలో కమలాపురం హబ్ వ్యవసాయాధి కారి రవిశంకర్, ఏఈఓ దస్తగిరి పాల్గొన్నారు.

సింహాద్రిపురం : భూసార పరీక్షలతో అధిక దిగుబడులు సాధించవచ్చునని ముద్దనూరు ఏడీఏ వెంకటసుబ్బయ్య తెలిపారు. గురువారం మండలంలోని కోవరంగుంటపల్లె, సింహాద్రిపురం ఆర్‌బీకేల సిబ్బందికి ఏఓ శివమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నేల, ఆరోగ్యం, మట్టి పరీక్షలపై ఆయన అవగాహన కల్పించి మాట్లాడారు. నేల స్వభావంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అమలుపరచాలంటే మట్టి నమూనా పరీక్షలు తప్పనిసరన్నారు. ప్రతి ఆర్‌బీకే పరిధి నుంచి కనీసం 20 మంది రైతుల పొలాల మట్టి నమూనాలు సేకరించాలన్నారు.

వల్లూరు : భూసార పరీక్షల వలన అనేక ప్రయోజనాలు వున్నాయని మండల వ్యవసాయ శాఖ అధికారి సాయిజ్యోతి తెలిపారు. స్థానిక మండల వ్యవసాయ కార్యాలయంలో మండల పరిధిలోని ఆర్‌బీకే సిబ్బందికి గురువారం భూసార పరీక్షల ఆవశ్యకతపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూసార పరీక్షలను నిర్వహించడం ద్వారా నేలలోని పోషకాల విలువలను తెలుసుకుని అవసరమైన పోషకాలను మాత్రమే అందించడం వలన పంటల సాగు ఖర్చు ఆదా చేసుకోవచ్చునన్నారు. అనంతరం మట్టి నమూనాల సేకరణ గురించి క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవోలు, వీఏఏలు పాల్గొన్నారు.

చెన్నూరు : రైతులు భూసార పరీక్షలు చేయించుకుంటే అధిక మేలు చేకూరుతుందని కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ టి.స్వామి చైతన్య తెలిపారు. గురువారం స్థానిక రైతు భరోసా కేంద్రం చెన్నూరు–2లో భూసార పరీక్ష, నేల పరిస్థితిపై మండలస్థాయిలో వ్యవసాయ సిబ్బందికి ఆయన వర్క్‌షాప్ నిర్వహించి మాట్లాడారు. మట్టి నమూనా తీసే విధానం గురించి తెలిపారు. కార్యక్రమంలో రైతుశిక్షణ కేంద్రం అధికారి పద్మజ, మండల వ్యవసాయాధికారి శ్రీదేవి, ఆర్బీకేల ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లె : యు.వెంకటాపురం రైతు భరోసా కేంద్రంలో గురువారం రైతు భరోసా సిబ్బందికి భూసార పరీక్షలపై శిక్షణ కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు నిర్వహించి మాట్లాడారు. పంట సాగు చేసే ముందు భూసార పరీక్షలు చేసేలా రైతులను చైతన్య పరచాలని ఆయన సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మండలంలోని 15 రైతు భరోసా కేంద్రాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కొండాపురం : మండలంలోని అన్ని రైతు బరోసా కేంద్రాలపరిధిలోని రైతులు తప్పనిసరిగా పొలంలో భూసార పరీక్షలు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి పి.అరుణ తెలిపారు. గురువారం మండల పరిధిలోని ఎస్.తిమ్మాపురం రైతు బరోసా కేంద్రంలో మండలంలోని వ్యవసాయ సహాకులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆయా రైతు బరోసా కేంద్రాలకు రైతులు వెళ్లి భూసార పరీక్షలు చేసుకోవాలని సూచించారు.

లింగాల : మండల పరిధిలోని పెద్దకుడాల గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో గురువారం ఆర్‌బీకే సిబ్బందికి భూసార పరీక్షలపై శిక్షణ తరగతులను ఏఓ రమేష్ నిర్వహించి సూచనలు సలహాలు ఇచ్చారు. విచ్చలవిడిగా రసాయనిక ఎరువులు, పురుగు మందులు వినియోగించి భూములు నిస్సారమైపోతున్నాయన్నారు. భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా పంటలు సాగు చేసి ఎరువులు, నత్రజని, భాస్వరం, పొటాషియం తదితర వాటిని తగిన మోతాదులో వినియోగించి ఖర్చులు తగ్గించుకుని అధిక దిగుబడులు సాధించుకోవచ్చునన్నారు.

నేడు చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ఉదయం చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ వి.ప్రతాప్‌రెడ్డి చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, బలపాలు, పూసలు తీయుట, గడ్డలకు ఎండోస్కోపి, సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24 గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతోపాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజిల్ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్ బాండిన చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

వేసవిలో పశువులపై ప్రత్యేక శ్రద్ధచూపాలి



మందులను పంపిణీ చేస్తున్న జిల్లా అధికారి

జమ్మలమడుగు : వేసవి కాలంలో పశువులకు సంక్రమించే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పశు సంవర్ధకశాఖ జిల్లా అధికారి డాక్టర్ రమేష్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని పి.బొమ్మెపల్లి గ్రామంలో ఏడీ వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో రైతులకు పశుసంరక్షణ, దూడల పెంపకం తదితర అంశాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. అనంతరం రైతులు పశువులకు సంబంధించిన వ్యాధినిరోధక కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రామనాథ్‌రెడ్డి, డాక్టర్ జాన్‌సుధాకర్, శివరామిరెడ్డి, చిరంజీవి, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి

పులివెందుల టౌన్ : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవితాన్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ తెలిపారు. గురువారం పట్టణంలోని స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ముందస్తు అంబేడ్కర్ జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చిన్నప్ప, పీఆర్‌ఓ బాలనారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు అంబేడ్కర్ జయంతి వేడుకలు

చింతకొమ్మదిన్నె : మండలంలోని తాడిగొట్ల సచివాలయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ గూడ ప్రభాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి సీకేదిన్నె జడ్పీటీసీ పి.నరేన్ రామాంజులురెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు.

ప్రారంభమైన అంకాలమ్మ తిరునాల



ప్రత్యేక అలంకరణలో అంకాలమ్మతల్లి అమ్మవారు

సింహాద్రిపురం : మండలంలోని అంకాలమ్మగూడూరులో వెలసిన అంకాలమ్మతల్లి తిరునాల గురువారం ప్రారంభమైంది. అమ్మవారిని ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం గ్రామాల సుభిక్షం కోసం సిరిబండిని గ్రామం చుట్టూ తిప్పారు. ఆదివారం ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ అశోక్‌రెడ్డి తెలిపారు. పోటీలలో గెలుపొందిన ఎద్దులకు తొమ్మిది బహుమతులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇందులో రూ.90వేలు మొదటి బహుమతిని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రధానం చేశారని, రూ.80వేలు రెండవ బహుమతి వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు శ్రీకాంత్‌రెడ్డి, రూ.70వేలు మూడవ బహుమతిని ఆలయ చైర్మన్ అశోక్‌రెడ్డి, రూ.60వేలు నాలుగో బహుమతిని వైఎస్సార్‌సీపీ నాయకుడు హరినాథరెడ్డిలు ప్రదానం చేస్తారని ఆయన తెలిపారు. పోటీలలో పాల్గొన్న వారికి రూ.5వేల కన్సలేషన్ బహుమతి ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు.

'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమానికి విశేష స్పందన



పులివెందుల : ఇ.కొత్తపల్లెలో స్టిక్కర్లను ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామస్తులు



వేముల : లబ్ధిదారులకు బ్రోచర్‌ను అందిస్తున్న మండల ఇన్‌చార్జి, జెడ్పీటీసీ, తదితరులు



చెన్నూరు : సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను ప్రజలకు అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పులివెందుల రూరల్ : మండల పరిధిలోని ఇ.కొత్తపల్లె గ్రామ సచివాలయ పరిధిలోని చంద్రగిరి గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, ఓబుళరెడ్డిలు గురువారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఇంటికి వెళుతూ గతంలో చంద్రబాబు పాలనలో జరిగిన మోసాన్ని, ప్రస్తుతం జగనన్న పాలలో జరుగుతున్న సంక్షేమ అభివృద్ధిని ప్రజలకు వివరించారు. అలాగే 8296082960 అనే ఫోన్ నెంబకు ప్రతి ఇంటి నుంచి మిస్డ్ కాల్ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రఫి, మల్లికార్జునరెడ్డి, కృష్ణ, ఆలీబాబా, డీలర్ ఓబులేసు, సుధాకర్, బీమ్లా నాయక్, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పులివెందుల టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని 28వ వార్డులో కౌన్సిలర్ గుల్జార్ బేగం ఆధ్వర్యంలో గురువారం మా నమ్మకం నువ్వే జగన్ – జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు మస్తాన్, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధి గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వేముల : అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించి వారి అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి, జెడ్పీటీసీ కోగటం వెంకటబయపురెడ్డిలు తెలిపారు. గురువారం మండలంలోని పెద్దజూటూరు పంచాయతీ పరిధిలోని ఎద్దులయేనే గ్రామంలో నిర్వహించిన మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. గ్రామంలో ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించడంతోపాటు ఏ మేరకు లబ్ధి చేకూరిందనే విషయాలపై లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రతి ఇంటికి, సెల్ ఫోన్లకు మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అతికించారు. అక్కడ నుంచే లబ్ధిదారులు సెల్ ఫోన్ ద్వారా పార్టీ నిర్దేశించిన ఫోన్‌నెంబర్‌కు మిస్‌కాల్ ఇప్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రామచంద్రారెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, నారాయణస్వామి, విశ్వనాథరెడ్డి, ప్రేమ్ సాగర్, దానం, పీటర్, ప్రభుదాసు, వార్డు మెంబర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు తదితరులు పాల్గొన్నారు.

సింహాద్రిపురం : మండల కేంద్రమైన సింహాద్రిపురం, బలపనూరు, దిద్దేకుంట్ల, కసనూరు, బిదినంచర్ల, గురిజాల తదితర గ్రామాల్లో గురువారం వైఎస్సార్‌సీపీ మండల నాయకుల ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఆయా గ్రామాల్లో తిరుగుతూ జగనన్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందుతున్న తీరును, గత ప్రభుత్వం చేసిన మోసాలను వివరిస్తూ కార్యక్రమం నిర్వహించారు. ఆయా సచివాలయాల్లోని అన్ని గ్రామాల్లో ఇంటింటికీ స్టిక్కర్ అతికించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు శ్రీకాంత్ రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, హరినాథరెడ్డి, బ్రహ్మనందరెడ్డి, వెలుగోటి చంద్రశేఖరరెడ్డి, రామకృష్ణారెడ్డి, బాబు, రఘునాథరెడ్డి, మల్లికార్జునరెడ్డి, ప్రహ్లాదారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, సుబ్బారెడ్డి, జనార్ధన్ రెడ్డి, రవీంద్రారెడ్డి, సర్పంచ్ శేఖరరెడ్డి, ఆయా గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లె : మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం కొనసాగుతోంది. గ్రామాల్లోని ప్రతి ఇంటికి వెళ్లి జగనన్నే మా భవిష్యత్ స్టిక్కర్‌లను అతికించడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, జేసీఎస్ కన్వీనర్లు, వలంటీర్‌లు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి

చెన్నూరు : మండలంలోని చిన్నమాచుపల్లె గ్రామ సచివాలయ పరిధిలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని కడప నగరం 50వ డివిజన్ కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల ఆధ్వర్యంలో వారి అనుచరులకు తప్ప మిగతా వారికి ఎటువంటి లబ్ధి చేకూరలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో మండల సచివాలయ కన్వీనర్ నిరంజన్‌రెడ్డి, చెన్నూరు టౌన్ సచివాలయాల కన్వీనర్ శ్రీనివాసరాజు, సర్పంచ్ సిద్దిగారి వెంకటసుబ్బయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు మాదినేని శ్రీను, చంటి, బుజ్జిరెడ్డి, బాలచంద్ర, బన్ని, ఓబులేశు, చెన్నకేశవ, వెంకటసుబ్బారెడ్డి, గుమ్మళ్ల మధుసూదన్‌రెడ్డి, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

మైలవరం (జమ్మలమడుగు రూరల్) : మైలవరం మండలం వద్దిరాల గ్రామంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని గురువారం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ధన్నవాడ మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామంలో గృహసారథులు, వలంటీర్లు తదితరులు ఇంటింటికీ వెళ్లి జగనన్న అమలు చేస్తున్న సంక్షేమపథకాల గురించి ప్రజలకు వివరించారు.

చింతకొమ్మదిన్నె : మండలంలోని నాగిరెడ్డిపల్లిలో గురువారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని సీకేదిన్నె జెడ్పీటీసీ పి.నరేన్ రామాంజులురెడ్డి నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో తిరిగి జగనన్నను ముఖ్యమంత్రి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గూడా ప్రభాకర్‌రెడ్డి, ఏపీ ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణయ్య, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

వేంపల్లె : స్థానిక క్రిష్టియన్ కాలనీలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మీగాయత్రి, సర్పంచ్ శ్రీనివాసులు పాల్గొని ప్రతి ఇంటికి వెళ్లి వైఎస్సార్‌సీపీ పాలన తీరుపై వారు ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అలాగే స్థానిక ప్రియాతోట, ఉషాకిరణ్ ఉన్నత పాఠశాల ప్రాంతాలలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు బాబాషరీఫ్, ఎంపీటీసీ చంద్రశేఖర్, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : మున్సిపల్ పరిధిలో ఉన్న 20 వార్డులలో ఆయా కౌన్సిలర్ల ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగనన్న అనే కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. 1వ వార్డులోని ప్రకాశ్‌నగర్ కాలనీలో, కడప రోడ్డులలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి ఎం.సురేంద్రనాథ్‌రెడ్డిలు పాల్గొని ఇంటింటికి వెళ్లి స్టిక్కర్లను అతికించారు . అలాగే మండలంలోని చిలంకూరు గ్రామంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులకు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సమావేశం నిర్వహించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి అందేలా చూసి పథకాలు ప్రజలకు అందుతున్నాయా లేదా కూడా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో చిలకూరు గ్రామానికి చెందిన పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.